సాక్షి
తిరుపతి
శుక్రవారం । 7 । జూలై । 2023



వరసిద్ధునికి 108 వాహనం

ప్రభుత్వం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి 108 వాహనాన్ని గురువారం అందించింది.



ఉన్నత చదువుకు సర్కారు బాసట

డిగ్రీ కళాశాలల అభివృద్ధికి, నాణ్యమైన బోధనకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కార్పొరేట్ చదువులకు దీటుగా విద్యనందిస్తోంది. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	34	26
చిత్తూరు	33	25
తిరుమల	29	22
గూడూరు	36	28
నగరి	34	26

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 77,299 మంది స్వామివారిని దర్శించుకోగా, 30,479 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి హుండీ కానుకలు రూ.3.93 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జిల్లాలో 112 మంది కుష్టు బాధితులు



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీచేస్తున్న అరుణ సులోచనదేవి

చిల్లకూరు: జిల్లాలో ఇప్పటివరకు 112 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు జిల్లా కుష్టు నివారణాధికారి అరుణ సులోచనదేవి తెలిపారు. మండలంలో చేపట్టిన కుష్టు, క్షయ వ్యాధి గ్రస్తుల సర్వేను ఆమె గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుష్టు, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి వైద్యం అందించే క్రమంలో భాగంగా జూన్ 26 నుంచి జూలై 16 వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం మందులు ఉచితంగా అందిస్తున్నందున నియంత్రణ సులభమవుతుందని చెప్పారు. శరీరంపై స్పర్శలేని ఎలాంటి పొడలు ఉన్నా వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకుని మందులు వాడుకుంటే తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులు 112 మంది, క్షయ వ్యాధిగ్రస్తులు 1,648 మంది ఉన్నారని వీరికి ఆయా ప్రాంతంలోని వైద్య సిబ్బంది ఇంటికి వెళ్లి మందులు అందిస్తున్నట్లు వివరించారు. సర్వే పూర్తి అయిన తరువాత కొత్త కేసులు ఏమైనా నమోదు అయితే వారికి మందులు అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఆమె వెంట చిల్లకూరు వైద్యాధికారి భావనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు హౌసింగ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న వరముని

భాకరాపేట : గృహనిర్మాణ సంస్థ 45 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వార్షికోత్సవంలో చిన్నగొట్టిగల్లు మండల గృహ నిర్మాణ శాఖకు బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ అవార్డు దక్కింది. వార్షికోత్సవ సభలో మండల ఇన్‌చార్జి ఏఈ వరముని రాష్ట్ర స్థాయి అధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా: శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో రెండేళ్ల కాల వ్యవధి పారామెడికల్ (అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్) కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ గురువారం మీడియాకు తెలిపారు. 2023–24 అకడమిక్ ఇయర్‌గాను ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిప్లమో కోర్సులకు అర్హులన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో 111 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. తిరుపతి చిత్తూరు నెల్లూరు జిల్లాకు చెందిన విద్యార్థులు అర్హులన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు అడ్మిషన్లు ఉంటాయని స్పష్టం చేశారు.

డీడీలు సకాలంలో చెల్లించాలి



సుమతి

తిరుపతి అర్బన్: రేషన్ డీలర్లు డీడీలు సకాలంలో చెల్లిస్తే, వెంటనే గిడ్డంగుల డీటీలు సరుకులను పంపడానికి సిద్ధంగా ఉన్నారని సివిల్ సప్లయ్స్ డీఎం వై.సుమతి గురువారం వెల్లడించారు. జాప్యం లేకుండా ఎవరి పని వారు సకాలంలో చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. ఒక్కో వ్యక్తికి ఐదు కేజీల బియ్యం ఇస్తున్న నేపథ్యంలో బియ్యం లేదా రాగులు ఏవైనా తీసుకునే సౌకర్యం ఉందని వివరించారు. ఆగస్టు నుంచి గర్భవతులు, బాలింతలకు ఇచ్చే మూడు కిలోల బియ్యానికి సంబంధించి బ్యాగులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోందని తెలియజేశారు.

అడవి దొంగలు

తెల్లరాయి కోసం పచ్చని అడవిని నాశనం చేస్తున్నారు. రాత్రుల్లో గుట్టల్లోకి చొరబడి ఎక్కడబడితే అక్కడ తవ్వకాలు జరిపేస్తున్నారు. తవ్వకాలకు అనుమతి ఒకచోట తీసుకుని మరోచోట తవ్వేస్తున్నారు. తెల్లరాయి అన్వేషణలో వందల ఏళ్ల నాటి వృక్షాలను నరికేస్తున్నారు. అడవిలో రోడ్డు ఏర్పాటు చేసుకుని మరీ ఖనిజాన్ని దోచుకుంటున్నారు. అటవీ సంరక్షణను గాలికొదిలేసిన యంత్రాంగం మామూళ్ల మత్తులో మూలుగుతోంది. దీంతో ఈ అడవి దొంగల వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.



అక్రమ తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

- అనుమతులు ఓ చోట.. తవ్వకాలు మరోచోట
- తెల్లరాయి కోసం అటవీనాశనం
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం

సాక్షి, తిరుపతి: జిల్లాలోని గూడూరు అటవీ ప్రాంతంలో తెల్లరాయి నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ తెల్లరాయికి చైనాలో మంచి డిమాండ్ ఉంది. అందుకే ఈ రాయి కోసం వ్యాపారులు ఎగబడుతుంటారు. ఒక్క సైదాపురం మండల పరిధిలో 89 మైనింగ్ లీజులు ఉంటే, 139 మైనింగ్ యార్డులకు అనుమతులు ఉన్నాయి. అయితే అనుమతులు ఉన్న అన్ని చోట్ల తెల్లరాయి దొరికే పరిస్థితి లేదు. కేవలం నాలుగైదు ప్రాంతాల్లో మాత్రమే ఈ రాయి లభ్యం అవుతుంది. దీంతో రాయి లభించని చోట అనుమతులు తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా అడవంతా అన్వేషించి, అడ్డదిడ్డంగా ఎక్కడ బడితే అక్కడ తవ్వేస్తున్నారు.



అడవిలో తెల్లరాయి తవ్వి తీసిన పరిసరాలు

పగలు గాలించి రాత్రి తవ్వకం

ఈ తెల్లరాయి కోసం అటవీ నాశనానికి శ్రీకారం చుట్టారు. ఈ దొంగలు పగలంతా అడవిలో అన్వేషణ సాగిస్తారు. చిన్న చిన్న గునపాలు తీసుకుని అడవంతా గాలిస్తారు. తెల్లరాయి ఉన్నచోట గుర్తులు ఉంచి వెళ్లిపోతారు. పొద్దుపోయాక జేసీబీ, టిప్పర్లతో అడవిలోకి చొరబడతారు. గుట్టుచప్పుడు కాకుండా ఉన్న రాయినంతా తవ్వుకుంటారు. ఆ తరువాత గుంతలు కనిపించకుండా పూడ్చివేస్తారు. ఈ రాయిని టిప్పర్లకు నింపి అనుమతులు ఉన్న చోటుకు తీసుకొచ్చి నిల్వచేస్తారు. ఈ రాయిని యంత్రాలతో చిన్న చిన్న రాళ్లుగా మార్చి ప్యాక్‌చేస్తారు. అక్కడి నుంచి యథేచ్ఛగా టిప్పర్లు, లారీల ద్వారా చెన్నైకి తరలిస్తారు. అక్కడి నుంచి వ్యాపారులు చైనాకు ఎగుమతి చేస్తున్నారు.

తెల్లరాయి ధరలు ఇలా..

అడవిలో లభ్యమయ్యే ఈ తెల్లరాయికి మంచి ధర ఉంటుంది. సాధారణ రాయి అయితే టన్ను రూ.5వేలు. మొదటి శ్రేణి రాయి టన్ను రూ.25వేలు. ఇది ఒక టిప్పర్‌కి రూ.7.50 లక్షలు పలుకుతోంది. తెల్లరాయితో గాజు గ్లాసు, గిన్నెలు తయారు చేస్తారు. ఇంకా రాయిని చిన్న చిన్న గుండ్రని రాళ్లుగా కత్తిరించి, నివాసాల్లోని పూలు, చెట్ల కుండీల్లో, అక్వేరియంలో ఉంచుతారు.

తిలాపాపం తలాపిడికెడు

అక్రమంగా తవ్వుకొచ్చిన రాయిని తరలించేందుకు అడవి దొంగలు కొందరు అధికారులకు మమూళ్లు ఇచ్చి నోరుమూయించేస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఒక టిప్పర్‌కి రూ.35వేల నుంచి రూ.40వేల వరకు మామూళ్ల రూపంలోనే ఇస్తున్నట్లు సమాచారం. ఈ మొత్తం ఐదు శాఖల అధికారులకు ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పరిమితికి మించి లోడింగ్



అధికలోడుతో వెళ్తున్న టిప్పర్

టిప్పర్‌లో 18 టన్నులకు మించి రాయిని నింపకూడదు. అయితే ఇక్కడ ఒక్కో టిప్పర్‌కి 30 టన్నులకుపైనే రాయిని నింపుకుని తరలిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. అయితే లీజు తీసుకున్న వ్యాపారులు మాత్రం గిట్టుబాటు ధర వచ్చే వరకు వేచి చూస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు ఎప్పటికప్పుడు తవ్వుకొచ్చిన రాయిని తక్కువ ధరకే విక్రయించేస్తున్నారు. దీంతో నిజమైన లీజుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

టీటీడీకి వాహనం విరాళం



వాహనాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేస్తున్న దాతలు

తిరుమల: తిరుమల శ్రీవారికి బెంగళూరుకు చెందిన కోదండ రెడ్డి గురువారం రూ.14 లక్షల విలువైన ఫోర్స్ ట్రావెలర్ వాహనాన్ని విరాళంగా అందజేశారు. శ్రీవారి ఆలయం ఎదుట పూజలు నిర్వహించి, వాహనం తాళాలను, డాక్యుమెంట్లను ఈవో ఏవీ ధర్మారెడ్డికి దాత అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల డీఐ జానకిరామిరెడ్డి, అన్న ప్రసాదం ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

ఎగసిపడుతున్న సాగర కెరటాలు



వాకాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గురువారం మండలంలోని తూపిలిపాళెం వద్ద సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దీంతో సముద్రం దాదాపు 10 మీటర్ల వరకు ముందుకు చొచ్చుకు రావడంతో కెరటాలు ఒడ్డున తాకుతున్నాయి. సముద్ర తీరంలో ఆకాశం నల్లని కారు మబ్బులతో కమ్మేసి సన్నని తుంపర్లతోపాటు గంటకు 15 నుంచి 20 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ వేటను నిలుపుదల చేసి, బోట్లకు ఒడ్డున లంగరు వేశారు. బీచ్‌కు వచ్చిన పర్యాటకులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

సజావుగా ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వివిధ కేడర్ల టీచర్ల ఉద్యోగోన్నతులకు డీఈవో కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎం కేడర్‌కు 18 మంది, ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు 8 మంది, పీఈటీ కేడర్ నుంచి ఫిజికల్ అసిస్టెంట్ కేడర్‌కు 31 మందికి ఉద్యోగోన్నతులు కల్పించినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

కేజీబీవీ కళాశాలల్లో పోస్టుల భర్తీ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ) కళాశాలల్లో పోస్టుల భర్తీకి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు కోరుకున్న పాఠశాలలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ ప్రక్రియలో డీఈవో విజయేంద్రరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమం

- తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిదారులతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం : దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడూ అందించలేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నను ప్రతి గడప ఆదరిస్తోందని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. తిరుపతి 30వ డివిజన్ నెహ్రూనగర్‌లో గురువారం ఆ డివిజన్ కార్పొరేటర్ కల్పనయాదవ్, అధ్యక్షులు షేక్ ఇమ్రాన్‌బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివరించారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్నకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయన్నారు. చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా ఎన్ని అసత్య ఆరోపణలు, విషపురాతలు రాసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని చెప్పారు. జగనన్న అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని గుర్తుచేశారు. జగనన్న పేదప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో తిరిగి గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ఆ దుర్మార్గపు పాలన ఎందుకు

చంద్రబాబు 14ఏళ్ల పాటు పాలించిన దుర్మార్గపు పాలనను తిరిగి ప్రజలు కోరుకోవట్లేదని భూమన కరుణాకరరెడ్డి అన్నారు. 40ఏళ్ల ఇండస్ట్రీ, 14ఏళ్ల పాటు ముఖ్యమంత్రిని అని చెప్పుకునే చంద్రబాబు ఏనాడైనా ప్రజలకు చిన్నపాటి మేలు చేశాడా? అని ప్రశ్నించారు. ధనవంతులకు కొమ్ముకాయడం తప్ప పేదల సంక్షేమం కోసం ఏనాడైనా ఆలోచించి ఒక సంక్షేమ పథకాన్ని అమలు చేశారా? అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చంద్రబాబును మూలన కూర్చోపెట్టినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. మళ్లీ ప్రజలను మభ్యపెట్టి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చేందుకు దుష్ట ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సంక్షేమ వారధిగా నిలుస్తోంది. పథకాల అమలు ప్రక్రియను ఎప్పటికప్పుడు వంద శాతం పూర్తి చేస్తోంది. లబ్ధిదారులకు పథకాలను సమర్థవంతంగా అందించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. జాప్యానికి తావీయకుండా సకాలంలో లక్ష్యాన్ని సాధించి అగ్రస్థానంలో నిలుస్తోంది. మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తూ వారి జీవితాల్లో కొత్త కాంతులు నింపుతోంది. పింఛన్ల నుంచి రుణాల వరకు అన్నింటినీ విజయవంతంగా అమలు చేస్తూ అందరితో భేష్ అనిపించుకుంటోంది.



చంద్రగిరిలో చేయూత మహిళా మార్టును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి రోజా, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి(ఫైల్)

గ్రామీణాభివృద్ధి .. సంక్షేమ వారధి

- లక్ష్య సాధనలో అగ్రస్థానం
- పథకాలు వంద శాతం అమలు
- మహిళలకు జీవనోపాధి పెంపు

తిరుపతి రూరల్: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను విజయవంతంగా లబ్ధిదారులకు చేరవేయడంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) కీలకపాత్ర పోషిస్తోంది. ఏదైనా పథకం డీఆర్‌డీఏ ద్వారా అమలు చేస్తే వంద శాతం విజయం సాధిస్తుందని నిరూపించుకుంది. వైఎస్సార్ క్రాంతి అనుబంధంతో మహిళల ఆర్థికాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు వారధిగా ఈ సంస్థ నిలుస్తోంది. పథకం అమలుకు ముందే షెడ్యూల్ ప్రకారం పలు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పర్యటిస్తున్నారు. పథకాలను అర్హులకు సకాలంలో అందజేయడంతోపాటు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. గడిచిన నాలుగేళ్లుగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయడంలో డీఆర్‌డీఏ అధికారులు విజయం సాధిస్తున్నారు. ఎక్కడా జాప్యం, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా డీబీటీ విధానంలో లబ్ధిదారులకు అందించారు. కేవలం మహిళల ఆర్థిక జీవనోపాధులను పెంపొందించడమే కాకుండా రైతులు, పేదలకు సేవలను విస్తరించారు.

పింఛన్ అందించడంలో అగ్రస్థానం

వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో జిల్లాలోని అన్ని మండలాలు ముందంజలో ఉంటున్నాయి. ప్రభుత్వం నవరత్నాలు అమలు చేయడంలో భాగంగా వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో భాగంగా దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలలోని అర్హులకు వివిధ రకాల పింఛన్లు అందిస్తున్నారు. వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలకు, మత్స్యకారులకు, హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు, చర్మకారులకు రూ.2,750 చొప్పున, వికలాంగులు, డప్పు కళాకారులు, హిజ్రాలకు రూ.3 వేలు చొప్పున,



డీఆర్‌డీఏ సాయంతో ఏర్పాటు చేసిన డ్రైఫ్రూట్ ప్యాకింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ జ్యోతి(ఫైల్)

మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు, తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా వ్యాధిగ్రస్తులకు, తీవ్ర హీమోఫిలియా వారికి రూ.10 వేల చొప్పున పింఛన్లు అందిస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 2,61,890 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారందరికీ ప్రతి నెలా 1నుంచి 5వ తేదీలోపు రూ.68 కోట్లను అందజేస్తున్నారు. గత మూడున్నర ఏళ్లలోనే రూ.3,155 కోట్లను పింఛన్ల ద్వారా లబ్ధిదారులకు అందజేశారు.

రుణాలివ్వడంలోనూ సఫలీకృతం

బ్యాంక్ లింకేజీ కింద 92,161 స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు గత నాలుగేళ్లలో రూ.3,285 కోట్లను రుణంగా అందించడంలో డీఆర్‌డీఏ సఫలీకృతం అయింది. లక్ష్యానికి మించి 117 శాతం లక్ష్యాలను అధిగమించింది. వైఎస్సార్ చేయూత పథకం కింద 45 నుంచి 60 ఏళ్లు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు రూ.18,750 చొప్పున 1,11,408 మందికి, రూ.573.47 కోట్లను అందించారు. జిల్లా వ్యాప్తంగా కల్యాణమస్తు/షాదీ తోఫాకు 632 దరఖాస్తులు అందగా, అన్నింటికీ అనుమతులిచ్చి రూ.3.34 కోట్లు చెల్లించారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 1,33,380 మందికి స్త్రీ నిధి పథకం కింద రూ.645.83 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయగా, సమర్థవంతంగా సకాలంలో నిధులు అందజేశారు.

పక్కాగా బీమా పరిహారం

వైఎస్సార్ బీమా పథకం కింద 18 నుంచి 70 ఏళ్ల వయసున్న కుటుంబ యజమానికి ప్రభుత్వం ఉచితంగా బీమా చేయిస్తోంది. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది. బీమా పొందిన వారు సహజ మరణం జరిగితే రూ.లక్ష, ప్రమాదంలో చనిపోయినా, పూర్తి అంగవైకల్యం కలిగిన రూ.5 లక్షలు బీమా చెల్లిస్తారు. కుటుంబ యాజమాని మరణించిన కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేలు అందిస్తారు. దీని కోసం కోసం జిల్లాలో 32 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో 1,397 మంది మృతి చెందగా, నామినీలకు ఎటువంటి ప్రలోభాలు, అడ్డంకులు లేకుండా రూ.5.07 కోట్లు అందించారు. ఇందులో సహజ మరణాలకు సంబంధించి రూ.4.87 కోట్లు చెల్లించారు. చిరు వ్యాపారులను ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో సున్నా వడ్డీతో రూ.10 వేలు ఆర్థిక సాయం అందించే జగనన్న తోడు పథకానికి 15,015 మంది అర్హులుండగా వారి కోసం రూ.15.02 కోట్లు కేటాయించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణమాఫీ కల్పించేందుకు వైఎస్సార్ ఆసరా పథకం కింద జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,51,001 మంది సభ్యులకు మూడు విడతల్లో రూ.697 కోట్లు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఆదాయ వనరులు సమకూర్చే కార్యక్రమాల ద్వారా జీవనోపాధిని పెంపొందించేందుకు ఉన్నతి పథకం కింద 15,009 స్వయం సహాయక సంఘాలు లబ్ధి పొందాయి. ఆయా గ్రూపులకు రూ.169.35 కోట్ల లబ్ధి చేకూరింది.

117 శాతం లక్ష్యాలను సాధించాం



జిల్లాలోని మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడంలో 117శాతం లక్ష్యాలను సాధించాం. సంక్షేమ పథకాల సొమ్మును సకాలంలో లబ్ధిదారులకు అందజేస్తున్నాం. ఈ నాలుగేళ్లలో పథకాల లక్ష్యాన్ని పూర్తి చేశాం. చాలా సంతృప్తిగా సేవలు అందిస్తున్నాం. ఎక్కడా జాప్యం జరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం.

– జ్యోతి, పీడీ, డీఆర్‌డీఏ, తిరుపతి జిల్లా

హోటల్స్ అసోసియేషన్ సభ్యుడిగా అంజి



అంజిని సత్కరిస్తున్న అసోసియేషన్ నేతలు, హోటల్స్ అధినేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన చిల్లీస్ హోటల్స్, రెస్టారెంట్ అధినేత చిల్లీస్ అంజిని ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం రాష్ట్ర అధ్యక్షుడు రామిశెట్టి వీరాస్వామి, తిరుపతి హోటల్స్ అధినేత బ్లిస్ బాలకృష్ణ, సింధూరి పార్క్ హోటల్ అధినేత వెంకయ్య, హోటల్ గణేష్ అధినేత కుమారస్వామిరెడ్డి, రెగాలియా నితిన్ పలువురు ప్రముఖులు చిల్లీస్ అంజిని ఘనంగా సత్కరించి అభినందించారు.

9న మహిళా క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని వైఎస్సార్ క్రీడా మైదానంలో చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన మహిళా క్రికెట్ జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. ఆ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్స్, అండర్–19, అండర్–15 విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీనియర్ విభాగానికి వయో పరిమితి లేదని తెలిపారు. ఇతర వివరాలకు క్రికెట్ కోచ్‌లు అనిత 98857 32053, ఆర్‌కె.మురుగన్ 98490 26131, చిన్నబాబు 79818 80381నను సంప్రదించాలని కోరారు.

నాడు : పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల ఉన్నత చదువుకు కల్పించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను టీడీపీ పాలకులు నిర్వీర్యం చేశారు. చాలా మంది ఉన్నత చదువులకు దూరమయ్యారు. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు రావడం లేదని కార్యాలయాల చుట్టూ విద్యార్థులు కాళ్లరిగేలా తిరిగేవారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏ మాత్రం అభివృద్ధి చేయని దుస్థితి. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడం, ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు చెల్లించుకోలేక చాలా మంది విద్యార్థులు టీడీపీ పాలనలో ఉన్నత చదువులకు స్వస్తి పలికారు.

నేడు : పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు శ్రీకారం చుట్టారు. ఉన్నత విద్య అభ్యసించే వారికి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందజేస్తున్నారు. ఏటా నాలుగు విడతలుగా నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదును ప్రభుత్వం జమచేస్తోంది. డిగ్రీ కళాశాలల అభివృద్ధికి సైతం సర్కారు చర్యలు చేపడుతోంది. మౌలిక వసతులను కల్పిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పిల్లలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించుకుంటున్నారు.



పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఉన్నత చదువుకు సర్కారు బాసట

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జోరుగా అడ్మిషన్లు
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువులకు భరోసా
- సకల సౌకర్యాలు, హాస్టల్ వసతి
- 12 వరకు దరఖాస్తులకు అవకాశం
- కళాశాలలో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కార్పొరేట్ చదువులకు దీటుగా విద్యనందిస్తున్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బీఏ, బీకాం, బీఎస్సీ, ఇతర కోర్సులున్నాయి. కళాశాలల్లో అన్ని వసతులూ ఉన్నాయి. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 21 ప్రభుత్వ డిగ్రీ, 121 ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలున్నాయి. ఆ కళాశాలల్లో లక్షకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీ లో చేరాలనుకునేవారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 12 వ తేదీ వరకు గడువు ఉంది. అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

ప్రైవేట్‌కు దీటుగా పీవీకేఎన్ కళాశాల

జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ప్రైవేట్‌కు దీటుగా సౌకర్యాలున్నాయి. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ గ్రేడ్ అనుమతి పొందింది. ఆ కళాశాలకు ఎన్నో సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ చదివిన చాలా మంది ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డారు. అదే విధంగా ఇక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా దూరవిద్యను అందిస్తున్నారు. నాక్ ఏ గ్రేడ్ ఉండడంతో విశ్వవిద్యాలయాల నిధుల సంఘం నిధులను



సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

కేటాయిస్తోంది. కళాశాలలో అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. విశాలమైన క్రీడామైదానం, సమీపంలోనే బాలికల కోసం ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాలున్నాయి. కళాశాలలో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ప్రొజెక్టర్‌లు, వర్చువల్ క్లాస్ రూమ్‌లు, గ్రీన్‌బోర్డులు, కంప్యూటర్ సిస్టమ్ టీచింగ్ లెర్నింగ్ ఎయిడ్‌లు అందుబాటులో ఉన్నాయి.

మహిళా విద్యకు చిరునామా

మహిళలు విద్యావంతులైతే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందిస్తోంది. జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల చదువులకు కేరాఫ్‌గా భాసిల్లుతోంది. విద్యార్థినులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. నిష్ణాతులైన అధ్యాపకులతో విలువలతో కూడిన విద్యా విధానం అందిస్తున్నారు. ప్రైవేటు రంగానికి దీటుగా అనేక సౌకర్యాలు కళాశాలలో ఉన్నాయి. ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయం, రీడింగ్ రూం, కంప్యూటర్ రూం, జవహర్ విజ్ఞాన కేంద్రం, కళాశాలలోనే ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహం వసతులున్నాయి. సామాజిక, ఆర్థిక పరిస్థితులు, ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణమైన కోర్సుల్లో విద్యార్థినులను ఉత్తములుగా తీర్చిదిద్దుతోంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..	
ప్రభుత్వ కళాశాలలు	21
ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలు	121
అడ్మిషన్ రిజిస్ట్రేషన్లకు ఆఖరు తేదీ	జూలై 12
వెబ్‌ఆప్షన్‌ల నమోదు	జూలై 15 నుంచి జూలై 19 వరకు
సీట్ల కేటాయింపులు	జూలై 24
కళాశాలల్లో చేరాల్సిన తేదీ	జూలై 24

పరిశోధనల విద్యకు కళాశాల ఆదర్శం



బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం అనేక విద్యాసంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. డిగ్రీ పూర్తి చేసే విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. విద్యార్థులకు ఉపయోగకరంగా అన్ని సౌకర్యాలు పీవీకేఎన్ కళాశాలలో ఉన్నాయి. ప్రైవేట్‌కు దీటుగా అన్ని హంగులతో కళాశాలను కొనసాగిస్తున్నాం. అడ్మిషన్ ప్రక్రియలో విద్యార్థులు ఈ కళాశాలను ఎంపిక చేసుకుని తమ బంగారు భవిష్యత్తుకు తీర్చిదిద్దుకోవాలి. – డాక్టర్ ఆనందరెడ్డి, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, చిత్తూరు

విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందేలా...



తమ కళాశాలలో అందిస్తున్న విద్యా బోధన విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా ఉంటోంది. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ బోధన సాగిస్తున్నాం. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది. ప్రభుత్వం కళాశాల అభివృద్ధికి కృషి చేస్తోంది. ఇటీవల తమ కళాశాలను నాక్ బృందం సందర్శించింది. ఆ బృందం ఏ గ్రేడ్ ప్రకటించింది. – డాక్టర్ కె.మనోహర్, ప్రిన్సిపల్, సావిత్రమ్మ డిగ్రీ కళాశాల చిత్తూరు

ఎస్వీయూలో చరిత్ర పరిరక్షణపై రాష్ట్ర సదస్సు రేపు

తిరుపతి కల్చరల్: హిస్టరీ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు చరిత్ర పరిరక్షణపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.శివనాగరాజు, జి.గోపిచంద్ ప్రకాష్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు చరిత్ర పరిరక్షణ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించడంతో పాటు హిస్టరీని పరిరక్షిద్దాం అనే ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్ర ప్రాధాన్యత తగ్గిపోవడంతో మానవీయ విలువలు, దిగజారుతున్నాయన్నారు. చరిత్రను చదవకుండా భవిష్యత్తును నిర్దేశించుకోలేమని తెలిపారు. చరిత్ర పాఠ్యాంశం గత వైభవాన్ని పునరుద్ధరించాలని, చరిత్ర పాఠ్యాంశం పరిరక్షణ కోసం రాష్ట్రంలోని చరిత్ర జూనియర్ లెక్చరర్లు ఐక్యతతో 2020లో ఒక సంఘంగా ఏర్పాటు చేసి, చరిత్ర పరిరక్షణ కోసం అనేక సదస్సులు ఏర్పాటు చేస్తూ చైతన్యం కలిగించడం జరుగుతోందన్నారు. ఇతర పాఠ్యాంశాలపై ఉన్న మక్కువతో చరిత్ర పాఠ్యాంశానికి సరైన ఆదరణ లేకపోవడంతో ఇంటర్మీడియట్ స్థాయిలో హెచ్‌ఈసీ గ్రూప్‌లో చేరే విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు క్రమేపీ తగ్గిపోతోందన్నారు. గ్రూపులతో సంబంధం లేకుండా చరిత్ర పాఠ్యాంశాన్ని కామన్ సబ్జెక్టుగా పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ఎస్వీ యూనివర్సిటీలోని సెనేట్ హాల్లో చేపడుతున్న చరిత్ర పరిరక్షణ రాష్ట్ర సదస్సుకు ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తుడా చైర్మన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ,తుడా వైఎస్ చైర్మన్ ఎస్.హరికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో హెచ్‌జేఎల్‌ఏ మహిళా రాష్ట్ర కార్యదర్శి ఎన్.శివశ్వేత, అసోసియేషన్ సహాయ కార్యదర్శి పి.బాబురావు, ప్రధాన సలహాదారుడు పి.లాభాను, తిరుపతి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, సాయిలక్ష్మి పాల్గొన్నారు.



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న లెక్చరర్స్ అసోసియేషన్ నేతలు

మాతా శిశు సంరక్షణకు కృషి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి

తిరుపతి తుడా: మాతా శిశు సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో గురువారం నూరా హెల్త్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహకారంతో యూనిసెఫ్ భాగస్వామ్యంతో మాత శిశు సంరక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాయలసీమ జిల్లాల పరిధిలోని వైద్య సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాత, శిశు సంరక్షణకు నిరంతరం కృషి చేయాలని చెప్పారు. గర్భిణిని నిరంతరం పర్యవేక్షించాలి అన్నారు. గర్భిణితో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న నర్సులతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

రేణిగుంట: మండల కేంద్రంలోని మాతమ్మ గుడి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు, బిస్మిల్లానగర్‌కు చెందిన అబ్దుల్ మస్తాన్ కుమారుడు అబ్దుల్ రజాక్(18) తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి పాత చెక్‌పోస్ట్‌లోని వారి బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా, మాతమ్మ గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రజాక్‌ను కరకంబాడిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన అబ్దుల్ రజాక్

బైక్ నుంచి పడి వ్యక్తి దుర్మరణం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని చంద్రబాబు కాలనీ వద్ద గురువారం బైక్‌పై నుంచి కిందపడి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, ఓజిలి మండలం కరబల్లోలు గ్రామానికి చెందిన అంకయ్య గౌడ్ (42) అండర్ బ్రిడ్జి నుంచి బైక్‌పై వస్తూ అదుపు తప్పి పడిపోయాడు. స్థానికులు ఆయన్ను లేపి కూర్చోబెట్టి, వారితో మాట్లాడారు. తరువాత కొద్దిసేపటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని తీసుకెళ్లిపోయారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.



మృతి చెందిన అంకయ్య గౌడ్

10 నుంచి శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలోని రైల్వేస్టేషన్ వెనుకనున్న శ్రీగోవిందరాజస్వామి సత్రాల్లో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం జరుగనుంది. మూడు రోజుల పాటు ఉదయం భజన మండళ్లతో సుప్రభాతం, సామూహిక భజన కార్యక్రమాలు చేపడతారు. సాయంత్రం సంగీత విభావరి, ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం ప్రారంభం సందర్భంగా ఈనెల 10వ తేదీన సాయంత్రం 4 గంటలకు శ్రీగోవిందరాజస్వామి ఆలయం నుంచి మూడో సత్రం ప్రాంగణం వరకు శోభాయాత్ర చేపట్టనున్నారు. ఇదే రోజు సాయంత్రం అధికార ప్రముఖుల సందేశం ఉంటుంది. 12వ తేదీ ఉదయం 4 గంటలకు అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు. అనంతరం వేల సంఖ్యలో భజన మండళ్ల సభ్యులతో సాంప్రదాయ భజనలు చేస్తూ సప్తగిరీశుని చేరుకుంటారు.

బాలికను వేధించిన ఉపాధ్యాయుడు అరెస్టు

వెంకటగిరి: రెండో తరగతి బాలికను లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు, మున్సిపాలిటీ పరిధిలోని బంగారుపేటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే కటికాల వెంకటేశ్వర్లు, రెండో తరగతి చదివే చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆ బాలిక ఏడుస్తూ ఇంటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు బిడ్డను సముదాయించి వివరాలు రాబట్టగా ఉపాధ్యాయుడి చేష్టలను తెలిపింది. దీంతో పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడిని నిలదీశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు పాఠశాలలో విచారణ చేపట్టారు. వేధింపులు నిజమని తేలడంతో ఉపాధ్యాయుడిని అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. అతనిపై పోక్సో చట్టంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. గతంలో కూడా ఈ ఉపాధ్యాయుడు బాలాయపల్లి మండలం కడగుంట పాఠశాలలో చిన్నారిని వేధించగా అక్కడా కేసు నమోదు చేసినట్లు తెలిసింది.